# పొలిటికల్ సభనా? అఫీషియల్ మీటింగా?

- 'ప్రజాపాలన' సమావేశంలో ప్రొటోకాల్ లొల్లి
- నిరసన వ్యక్తం చేసిన ఎమ్మెల్యే వెంకటేశ్
- బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య జగడం
- పోలీసుల రంగ ప్రవేశం.. సద్దుమణిగిన గొడవ



'ప్రజాపాలన' సమావేశంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీఆర్ఎస్ శ్రేణులు

అంబర్‌పేట, డిసెంబర్ 27: ప్రభుత్వ అధికారిక కార్యక్రమం ప్రొటోకాల్ తప్పి కాంగ్రెస్ సభగా మారడంతో బుధవారం జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్‌కు సంబంధించిన 'ప్రజాపాలన' సమావేశం రసాభాసగా సాగింది. అధికారులు యథేచ్ఛగా ప్రొటోకాల్ వదిలేయడంతో వాగ్వాదం, ఘర్షణకు దారి తీసింది. ప్రజాప్రతినిధులు ఉండాల్సిన సమావేశంలో మాజీలు, నాయకులు స్టేజీ ఎక్కి కూర్చోవడంతో ప్రొటోకాల్ జగడం మొదలైంది. అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడంతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ నిరసన వ్యక్తం చేస్తూ స్టేజి దిగారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య నినాదాల లొల్లి ప్రారంభమైంది.

వివరాల్లోకెళ్తే.. అంబర్‌పేట సర్కిల్‌కు సంబంధించి 'ప్రజాపాలన' సమావేశం స్థానిక మహారాణా ప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో స్పెషల్ ఆఫీసర్ శివకుమార్ నాయుడు నేతృత్వంలో జరిగింది. ఇందులో అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్లు మహాలక్ష్మి, ఉమా, అమృత, లావణ్య పద్మ తదితరులు హాజరయ్యారు. ఇదే సమావేశానికి మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన డా.సి.రోహిన్‌కుమార్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు శ్రీదేవి, రాంబాబు, జగన్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు స్టేజీ పైన కూర్చున్నారు. ముందుగా స్పెషల్ ఆఫీసర్ శివకుమార్ నాయుడు 'ప్రజాపాలన' విధి విధానాలను వివరించారు. ప్రతి డివిజన్‌కు నాలుగు చోట్ల సభలు ఏర్పాటు చేస్తున్నామని, ఇంటింటికి పొదుపు సంఘాల మహిళలు వచ్చి దరఖాస్తు అందజేస్తారని చెప్పారు. వాటిని నింపి దగ్గరలో ఉన్న లొకేషన్‌లో దరఖాస్తు అందజేయాలని వివరించారు. అనంతరం మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావును మాట్లాడాలని సదరు స్పెషల్ ఆఫీసర్ మైకు అందజేశారు. వీహెచ్ మాట్లాడిన తర్వాత స్టేజీ పైన ఉన్న కొందరు మాజీ కార్పొరేటర్లు ప్రొటోకాల్ తుంగలో తొక్కే విధంగా రోహిన్‌కుమార్‌రెడ్డి మాట్లాడాలి. మైక్ ఇవ్వండంటూ అధికారులకు చెప్పారు. కానీ అధికారులు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు మైక్ ఇచ్చి మాట్లాడాలని కోరారు.

ఎమ్మెల్యే వెంకటేశ్ మాట్లాడుతూ.. అన్ని పథకాలకు రేషన్‌కార్డును లింకు పెట్టడంతో పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. అనంతరం అధికారులు రోహిన్‌కుమార్‌రెడ్డిని మాట్లాడాలని మైక్ ఇస్తుండగా, ఎమ్మెల్యే అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ లేకుండా ఏ విధంగా రోహిన్‌రెడ్డిని మాట్లాడమంటారని అధికారులపై మండిపడ్డారు. ఇది పొలిటికల్ సభనా? లేకా.. అఫీషియల్ మీటింగా? అంటూ నిరసన వ్యక్తం చేస్తూ స్టేజి కిందకు దిగారు. రోహిన్‌రెడ్డి మాట్లాడుతుండగా.. బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేయడం మొదలుపెట్టారు. కేసీఆర్, కేటీఆర్, ఎమ్మెల్యే కాలేరు జిందాబాద్ అంటూ నినాదాలు చేయగా, కాంగ్రెస్ నాయకులు కూడా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు పార్టీల నాయకులను సముదాయించారు. దీంతో ఎమ్మెల్యే కాలేరు అక్కడ నుంచి వెళ్లిపోయారు. అనంతరం కొద్ది సేపు సమావేశం జరిగింది.

అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా ఎవరిని పడితే వారిని స్టేజి ఎక్కించడం ఎంత వరకు సబబు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇది మా ప్రభుత్వం ఇది.. మేము ఎందుకు మాట్లాడకూడదంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యాఖ్యానించడం గమనార్హం.



## పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

నల్లకుంట డివిజన్ రత్నానగర్‌లో రూ.40 లక్షల వ్యయంతో పునర్నిర్మించనున్న కమ్యూనిటీహాల్ పనులకు డివిజన్ కార్పొరేటర్ వై.అమృతతో కలిసి బుధవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మేడి ప్రసాద్‌తో పాటు బస్తీ ప్రజలు పాల్గొన్నారు. - అంబర్‌పేట, డిసెంబర్ 27

## సినిమాలతో సమాజం ప్రభావితం

చిక్కడపల్లి, డిసెంబర్ 27: కళలు, మానవీయ విలువలు కనుమరుగైపోతున్న నేటి కాలంలో సినిమాలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయని శాసనసభ తొలి సభాపతి మధుసూదనాచారి అన్నారు. బుధవారం త్యాగరాయ గానసభలో విఖ్యాత దర్శకుడు బాపు 90వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత బిన్ను, నటుడు సుదర్శన్, నటుడు సమీర్‌ను మధుసూదనాచారి ఘనంగా సన్మానించారు. ప్రముఖ గాయని హైమవతి భీమన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వంశీరామరాజు, దయానంద్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ చలాన్లపై అవగాహన

కాచిగూడ, డిసెంబర్ 27: పెండింగ్ చలాన్లపై ప్రభుత్వం కల్పించిన రాయితీని వాహనదారులకు సద్వినియోగం చేసుకోవాలని కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. బుధవారం బర్కత్‌పుర చమన్‌లో పెండింగ్ చలాన్లపై వాహనదారులకు అవగాహన కల్పించారు. జనవరి 10వ తేదీ వరకు పెండింగ్ చలాన్లపై ప్రభుత్వం డిస్కౌంట్ అవకాశం కల్పించిందన్నారు. కుటుంబసభ్యులను దృష్టిలోపెట్టుకొని వాహనాలను నడపాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

## ఐపీఎస్ నవీన్‌కుమార్ అరెస్టు అప్రజాస్వామికం

కాచిగూడ, డిసెంబర్ 27: పొంతనలేని ఆరోపణలతో ఐపీఎస్ అధికారి నవీన్‌కుమార్‌ను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం కాచిగూడలో 21 బీసీ సంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఐపీఎస్ బీసీ అధికారి నవీన్‌కుమార్‌ను అరెస్ట్ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని నవీన్‌కుమార్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నీలం వెంకటేశ్, కోల జనార్దన్, సహిత్, నందగోపాల్, రామకృష్ణ, అంజి, స్వరూప, వాణి, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజాపాలన' పారదర్శకంగా చేపట్టాలి

చిక్కడపల్లి, డిసెంబర్ 27: ఆరు గ్యారంటీల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న 'ప్రజాపాలన'ను పారదర్శకంగా అమలుచేయాలని, తక్షణమే సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిని నియమించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, స్కైలాబ్‌బాబు పేర్కొన్నారు. బుధవారం చిక్కడపల్లి కేవీపీఎస్ రాష్ట్ర కార్యాలయంలో కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాగర్జున, మనోహర్, సురేశ్, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## 'వందే భారత్' రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ, డిసెంబర్ 27: పట్టాలు దాటుతుండగా 'వందే భారత్' రైలు ఢీకొని గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన కథనం ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(30) మంగళవారం రాత్రి ఫలక్‌నామా-ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌ల మధ్య కందికల్ గేట్ వద్ద పట్టాలు దాటుతుండగా 'వందే భారత్' రైలు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. వివరాల కోసం 8143807592లో సంప్రదించాలని కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వెల్లడించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

గోల్నాక, డిసెంబర్ 27: బాగ్ అంబర్‌పేట డివిజన్ వడ్డెరబస్తీకి చెందిన షేక్ షమీర్‌కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.50వేల చెక్కును గోల్నాక కార్పొరేటర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం బీఆర్ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ లబ్ధిదారుడికి అందజేశారు.

# రజకుల అభివృద్ధికి అంజయ్య ఎనలేని కృషి

**అంజయ్య ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: ఎంపీ కే.లక్ష్మణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పిలుపు**



అంజయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గోపాల్, ఎంపీ లక్ష్మణ్ తదితరులు

కవాడిగూడ, డిసెంబర్ 27: రజకుల అభివృద్ధికి డాక్టర్ అంజయ్య ఎనలేని కృషి చేశారని, ఆయన సేవలు మరువలేనివని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కొనియాడారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయ ఎదుట రజక ధోబీ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ డాక్టర్ ఎం.అంజయ్య సాయి ద్వితీయ వర్ధంతిని తెలంగాణ రజక (ధోబీ) అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే.లక్ష్మణ్, కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ రచనశ్రీ, బీఆర్ఎస్ నాయకుడు జయసింహ హాజరై స్వర్గీయ అంజయ్య సాయి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ కే.లక్ష్మణ్, ఎమ్మెల్యే గోపాల్ మాట్లాడుతూ.. రజకుల కోసం అంజయ్య చేసిన సేవలు హర్షణీయమని, ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక (ధోబీ) అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ కృష్ణమూర్తి, రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ గాంధీ, రాష్ట్ర సీనియర్ వైస్ చైర్మన్ నరసింహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, రాష్ట్ర వైస్ చైర్మన్ హరినాథ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఖమ్మన్న, రాష్ట్ర కార్యదర్శి చుక్కన్న, గ్రేటర్ హైదరాబాద్ వైస్ చైర్మన్ చీమల అశోక్, ప్రధాన కార్యదర్శి, వైస్ చైర్మన్ రమేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## రైల్లో దొంగతనం

కాచిగూడ, డిసెంబర్ 27: అకోలా రైల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలి నగదు, వెండి ఆభరణాలను తస్కరించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన కథనం ప్రకారం.. ఏపీలోని జోషికాలనీకి చెందిన జైమీన్‌షా భార్య పాయల్ జైమీన్‌షా(42)వృత్తిరీత్యా టీచర్. జైపూర్ రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గ మధ్య నాందేడ్ రైల్వేస్టేషన్ సమీపంలో రూ.10 వేల నగదు, 2 గ్రాముల వెండి ఆభరణలు, ఆధార్‌కార్డులతో ఉన్న బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. బుధవారం జైమీన్‌షా కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని, తదుపరి విచారణ కోసం నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వెల్లడించారు.

## అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందేలా కృషి

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, డిసెంబర్ 27: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికీ అందించేలా కృషి చేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. బుధవారం చిక్కడపల్లి మహిళాభవన్‌లో 'ప్రజాపాలన' సన్నాహక సమావేశాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు అవగాహన కలిగేలా, లబ్ధి జరిగేలా చూడాలని పేర్కొన్నారు. సర్కిల్-15 డీఎంసీ తిప్పర్తి యాదయ్య మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో ప్రతి డివిజన్‌కు 4 ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు చేశామని, ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రజాపాలన ముషీరాబాద్ నియోజకవర్గం ప్రత్యేక అధికారి వెంకటరాంరెడ్డి, సర్కిల్ అడిషనల్ కమిషనర్లు ప్రవీణ్ చంద్ర, జాకీర్ హుస్సేన్ , తహసీల్దార్ వెంకటలక్ష్మి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.